


గ్రామ పాలనపై స్పెషల్ స్టాంప్



ఇక పంచాయతీలకు ప్రత్యేకాధికారులు

- నేటితో పాలకవర్గాల గడువు పూర్తి
- స్పెషల్ ఆఫీసర్ల జాబితా సిద్ధం చేసిన జిల్లా యంత్రాంగం
- కలెక్టర్ల ఆమోదముద్రే తరువాయి

సంగారెడ్డి టౌన్/మెదక్ అర్బన్, జనవరి 31 : గ్రామ పంచాయతీ పాలకవర్గాల గడువు నేటితో తీరిపోతున్నది. సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డుసభ్యులు కొలువుదీరి ఐదేళ్లు పూర్తయ్యింది. దీంతో తక్షణమే గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలనకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. సర్పంచ్‌ల స్థానాల్లో మండల, డివిజన్‌స్థాయి అధికారులకు బాధ్యతలు ఇవ్వడానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఏ గ్రామానికి ఏయే అధికారిని నియమిస్తున్నారనే జాబితా కూడా సిద్ధమైంది.

సంగారెడ్డి జిల్లాలో 647, మెదక్ జిల్లాలో 469 జీపీలు

సంగారెడ్డి జిల్లాలో 647, మెదక్ జిల్లాలో 469 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 2019 జనవరిలో మూడు దశలుగా 21, 25, 30 తేదీల్లో పంచాయతీలకు ఎన్నికలు జరిగాయి. ఫిబ్రవరి 1వ తేదీ అంటే నేటితో పాలకవర్గాల గడువు పూర్తికానున్నది. ఇప్పట్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించే పరిస్థితి లేకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేకాధికారులను నియమిస్తున్నారు.

ఆ గ్రామాలకు పెద్దసార్లు

గ్రామ పంచాయతీల్లో మండల కేంద్రాలు, మేజర్ గ్రామాలు, ఇతర ప్రత్యేకతలున్న గ్రామాలుకు స్పెషలాఫీసర్లుగా తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, డీఈలు, ఏడీఏలు వ్యవహరిస్తారు. ఇక వివిధ శాఖల ఏఈలు, మండల వ్యవసాయ అధికారులు, ఏఈవోలు, పీహెచ్‌సీ వైద్యాధికారులు, వెటర్నరీ అధికారులు, సీనియర్ అసిస్టెంట్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఆర్ఐలు, తదితర అధికారులంతా ఇతర గ్రామాల ప్రత్యేకాధికారులుగా బాధ్యతలు చేపట్టేలా జాబితా సిద్ధం చేశారు. ఇప్పటికే కలెక్టర్లకు నివేదించారు. మెదక్ జిల్లాలో అధికారుల జాబితాలో ఇప్పటికే రెండుసార్లు మార్పులు చేశారు. పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జాబితాకు కలెక్టర్ ఆమోదముద్ర వేయాల్సి ఉంది. ప్రత్యేకాధికారులుగా నియమితులైన వారికి గురువారం సాయంత్రంలోగా ఉత్తర్వులు అందజేయనున్నట్టు తెలిసింది. వారు సర్పంచ్‌ల నుంచి రికార్డులను స్వాధీనం చేసుకుంటారు. ఇక పంచాయతీ ఎన్నికలు జరిగేదాకా ఇవే స్థానాల్లో కొనసాగనున్నారు.

సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు సన్మానం

సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని ఆయా గ్రామ పంచాయతీ పాలకవర్గాలను అధికారులు, ప్రజాప్రతినిధులు సన్మానించారు. నేటితో పదవీకాలం ముగియనుండడంతో వారికి ఘనంగా వీడ్కోలు పలికారు. సిర్గాపూర్ సర్పంచ్ స్వప్నను కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎమ్మెల్యే సంజీవరెడ్డి సన్మానించారు. హవేలీఘణపూర్ మండలం కేంద్రంలో ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి సర్పంచ్‌లను సన్మానించారు.

కార్యదర్శే కథానాయకుడు

ప్రత్యేకాధికారుల పాలనలో పంచాయతీ కార్యదర్శులే కీలకం కానున్నారు. ప్రస్తుతం గ్రామాలను అదనపు బాధ్యతలుగానే అధికారులకు అప్పగించారు. దీంతో పూర్తి సమయాన్ని గ్రామాలకు కేటాయించలేకపోతారు. అందుకే నిరంతరం అందుబాటులో ఉండేలా పంచాయతీ కార్యదర్శులకు తగిన సూచనలిచ్చారు. సుదీర్ఘకాలం తర్వాత మళ్లీ కార్యదర్శులకు జాయింట్ చెక్‌పవర్‌ను కల్పించారు. ఇప్పటిదాకా సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లకు కలిపి జాయింట్ చెక్‌పవర్ ఉండగా ఇకపై ప్రత్యేకాధికారులు, కార్యదర్శులకు కలిపి నిధులను డ్రా చేసే అధికారం ఇచ్చారు. ఆయా గ్రామాలపై కార్యదర్శులకు పూర్తి పట్టు ఉండడంతో సమస్యలు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల్లో వీరి పాత్రనే కీలకం కాబోతున్నది. తాజా పరిణామాలతో ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు లేనందున కార్యదర్శులే అంతాతామై వ్యవహరించనున్నారు.

సర్పంచ్‌ల గగ్గోలు

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ఆసక్తి చూపడం లేదు. అయితే ఎన్నికలు జరిగేదాకా తమనే కొనసాగించాలని ప్రస్తుత సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు ప్రభుత్వాన్ని కోరారు. కానీ సర్కారు మాత్రం ప్రత్యేకాధికారుల పాలనవైపే మొగ్గుచూపింది. దీంతో సర్పంచ్‌ల ఆశలు ఆవిరయ్యాయి. గడిచిన ఐదేళ్లలో మొదటి ఏడాది పాలనాపరమైన విషయాలపై అవగాహన పొందడానికే సమయం గడిచిందని సర్పంచ్‌లు అంటున్నారు. ఇక వరుసగా రెండేళ్లు కరోనా కారణంగా ఇబ్బంది పడ్డామని చెబుతున్నారు. ఆ తర్వాత నిధుల కొరతతో ఆశించిన స్థాయిలో పనులు చేయలేకపోయామని, చేసిన పనులకు బిల్లులు రాలేదని ఆవేదన చెందుతున్నారు. కనీసం గత ప్రభుత్వ హయంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులైనా విడుదల చేయాలని కోరుతున్నారు. అయితే ఏకగ్రీవ పంచాయతీలకు ప్రోత్సాహకంగా గత ప్రభుత్వం రూ.10 లక్షల నజరానా ప్రకటించగా ఆరు నెలల వ్యవధిలోనే పంచాయతీ ఖాతాలో జమచేయాల్సి ఉండగా ఐదేళ్లు గడిచినా అందలేదు. పలుమార్లు ఏకగ్రీవ గ్రామపంచాయతీ పాలకమండలి పాలకవర్గాలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయింది.


మెదక్ మండల పరిధిలోని వివిధ గ్రామాల సర్పంచ్‌లను సన్మానిస్తున్న అధికారులు

సంగారెడ్డి జిల్లా కోర్టుకు సైబర్ క్రైం నిందితులు

- దేశవ్యాప్తంగా ఆరుగురిపై 5,865 కేసులు
- వీడియోకాన్ఫరెన్స్ ద్వారా హాజరు

సంగారెడ్డి క్రైం, జనవరి 31 : అమాయక ప్రజలను ఆసరాగా చేసుకొని, వరుసగా సైబర్ నేరాలకు పాల్పడుతూ దేశ వ్యాప్తంగా 5,865 కేసులు, తెలంగాణ వ్యాప్తంగా 924, సంగారెడ్డి జిల్లాలో 24 కేసులతో సంబంధం ఉన్న ఆరుగురు నిందితులను పీటీ వారెంట్‌పై సంగారెడ్డి జిల్లా న్యాయాధికారి ఎదుట సైబర్ క్రైం పోలీసులు బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రవేశపెట్టారు. జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ తెలిపిన వివరాల ప్రకారం... దేశ వ్యాప్తంగా సైబర్ నేరాలకు పాల్పడటానికి నిందితులు 2,926 ఫోన్‌నంబర్లు, 78 ఐఎంఈఐలను వినియోగించారు. జార్ఖండ్ రాష్ట్రం శీతల్పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నవాడి గ్రామానికి చెందిన నిజాముద్దీన్ అన్సారీ(23), అఫ్రోజ్ ఆలం(23), ఎండీ ఆమీర్ అన్సారీ(22), సర్ఫరాజ్ అన్సారీ(22), అఫ్రోజ్ అన్సారీ (22), పశ్చిమబెంగాల్‌లోని హీరోపరా గ్రామానికి చెందిన నాసిమ్ లిత్య(31)ను సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చారు. జిల్లా ప్రజలలు సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని, అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ రూపేష్ సూచించారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930 లేదా సైబర్ క్రైం పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలన్నారు.

వేల మంది పర్వాతారోహకులను తయారుచేయడమే లక్ష్యం

ఎవరెస్ట్ పర్వతారోహకురాలు, టార్క్ డైరెక్టర్ పూర్ణ


మాట్లాడుతున్న పూర్ణ

పటాన్‌చెరు రూరల్, జనవరి 31 : తనలాగే భవిష్యత్తులో వెయ్యి మంది పర్వతారోహకులను తయారుచేయడమే లక్ష్యమని ఎవరెస్ట్ పర్వతారోహకురాలు, ప్రపంచంలోని ఏడు ఎత్తయిన శిఖరాలను అధిరోహించిన ప్రస్తుత ట్రాన్సెండ్ పర్వతారోహక శిక్షణ సంస్థ (టార్క్) డైరెక్టర్ మాలావత్ పూర్ణ చెప్పారు. అమృత్కాల్ విమర్శ్ వికసిత్ భారత్ - 2024 ప్రసంగ పరంపరలో భాగంగా, విభిన్న అభివృద్ధి కార్యక్రమాలపై క్రీడల ప్రభావం, భారత విధానాలు అనే అంశంపై బుధవారం గీతం యూనివర్సిటీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ఆతిథ్య ఉపన్యాసం చేశారు. తనకు మద్దతునిచ్చిన సమాజానికి తిరిగి ఇవ్వాలనేదే తన ఆకాంక్ష అని ఈ సందర్భంగా పూర్ణ తెలిపారు. యువత, ముఖ్యంగా మహిళలు, బాలికలు వారి కలలను సాధించడానికి ప్రోత్సహించాలనేది తన ప్రగాఢ వాంఛ అని ఆమె చెప్పారు. స్పష్టమైన దృక్పథాన్ని అలవరుచుకోవడం, ఎప్పటికీ వెన్నుచూపకపోవడం, సవాళ్లను ఎదుర్కునే సత్తాను కలిగి ఉండాలన్నారు. తన తల్లిదండ్రులు, గురువు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, శిక్షకుడు శేఖర్‌బాబు తదితరులు తన ప్రయాణంలో ఇచ్చిన మద్దతు, మార్గదర్శనాలను ఈ సందర్భంగా మననం చేసుకున్నారు.

గంజాయి చాక్లెట్ల కలకలం

- చేర్యాలలో పాన్‌షాపులో విక్రయం
- 1,200 గంజాయి చాకెట్లు పట్టివేత
- విక్రయదారుడి అరెస్ట్
- హత్నూరలో కిలోన్నర ఎండు గంజాయి, చాక్లెట్లు స్వాధీనం

7లో

కష్టపడి చదివితేనే భవిష్యత్తు

సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

కల్హేర్/సిర్గాపూర్, జనవరి 31 : నేటి పోటీ ప్రపంచంలో చదువు ఎంతో ముఖ్యమని, కష్టపడి చదివితేనే మంచి భవిష్యత్ ఉంటుందని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. సిర్గాపూర్‌లో సమగ్ర శిక్షా నిధులతో నిర్మించిన కస్తూర్బా వసతి గృహం, గ్రామ పంచాయతీ భవనం, సర్వోదయ స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని కలెక్టర్ ఎమ్మెల్యే సంజీవరెడ్డితో కలిసి బుధవారం ప్రారంభించారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో సైన్స్‌ల్యాబ్, అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కస్తూర్బా విద్యాలయం, గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద నిర్వహించిన సమావేశాల్లో కలెక్టర్ మాట్లాడారు. విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని చదువుకోవాలని, ఉపాధ్యాయులు తమవంతు కృషి చేయాలన్నారు. సర్వోదయ ఫౌండేషన్ గ్రామాల్లో గ్రంథాలయాలను ఏర్పాటు చేసి విద్యాభివృద్ధికి తోడ్పడటం అభినందనీయమన్నారు. ఖేడ్ ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి మాట్లాడుతూ తమ ధ్యాసంతా గ్రామాల అభివృద్ధిపైనే ఉంటుందన్నారు. కష్టపడి ఐఏఎస్ చదివిన కలెక్టర్‌ను ఆదర్శంగా తీసుకోవాలని విద్యార్థినులకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, సర్వోదయ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, ఐఆర్ఎస్ అధికారి సుధాకర్ నాయక్, డీఈవో వెంకటేశ్వర్లు, సిర్గాపూర్ జడ్పీటీసీ రాఘవరెడ్డి, ఎంపీపీ మహిపాల్ రెడ్డి, సర్పంచ్‌లు స్వప్న శంకరయ్య, రవిపటేల్, సంజీవరెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.


పంచగామలో పంచాయతీభవనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

బాల సదనంను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

నారాయణఖేడ్, జనవరి 31: నారాయణఖేడ్ పట్టణంలోని బాల సదనంను సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి బుధవారం స్థానిక ఎమ్మెల్యే సంజీవరెడ్డితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె బాలసదనంలో ఉన్న గదులు, వసతులు, తదితర వివరాలను సంక్షేమాధికారి విజయను అడిగి తెలుసుకున్నారు. అదనపు గదుల నిర్మాణం పనులు అసంపూర్తి దశలో ఉన్నాయని ఎమ్మెల్యే కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. అంతకుముందు నారాయణఖేడ్ పట్టణ శివార్లలోని మోడల్ డిగ్రీ కళాశాలలో రిసెప్షన్ సెంటర్, స్ట్రాంగ్‌రూం ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం నారాయణఖేడ్ మండలం పంచగామలో పంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే సంజీవరెడ్డితో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాణిక్యమ్మ, సేవాలాల్ సంఘం రాష్ట్ర నాయకులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అప్‌గ్రేడ్ అంగన్‌వాడీల్లో పనులను పూర్తి చేయాలి

మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా


అధికారులతో మాట్లాడుతున్న మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా

మెదక్ అర్బన్, జనవరి 31: జిల్లాలోని అప్‌గ్రేడ్ అంగన్‌వాడీ కేంద్రాల్లో పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన ఛాంబర్‌లో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో వాటర్ ట్యాంక్‌లు, మరుగుదొడ్లు, కుళాయిల ఏర్పాటును పూర్తి చేయాలన్నారు. అసంపూర్తిగా ఉన్న భవనాల నిర్మాణాలు పూర్తిచేయాలని ఆదేశించారు.


రైస్‌మిల్లులో బియ్యం

మిల్లర్లపై ఆర్ఆర్ యాక్ట్?

- కస్టమ్ మిల్లింగ్‌లో జాప్యం
- బకాయిలు రూ.645 కోట్లు
- 45 రైస్‌మిల్లులపై కేసులకు సిద్ధం
- ఇప్పటికే కొన్ని మిల్లుల ఆస్తుల వేలంనకు ప్రకటన

మెదక్, జనవరి 31 : కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) అందించడంలో మెదక్ మిల్లర్లు అధికారుల హెచ్చరికలను ఖాతరు చేయలేదు. గడువులోగా బియ్యం ఇవ్వాలని అధికారులు పలుసార్లు హుకుం జారీ చేసినా మిల్లర్లు పెడచెవిన పెట్టారు. గడువు ముగిసినా లక్ష్యాన్ని చేరుకోని మిల్లర్లపై జరిమానాలు విధించడానికి అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. జిల్లాలో సుమారు రూ.645 కోట్ల విలువ చేసే బియ్యం రైస్ మిల్లర్ల వద్దే ఉండిపోయింది. ధాన్యం పక్కదారి పట్టించిన వారిపై క్రిమినల్ కేసులతో పాటు రెవెన్యూ రీకవరీ (ఆర్ఆర్) యాక్ట్ ప్రయోగించనున్నారు. ధాన్యాన్ని మిల్లింగ్ కోసం తీసుకుని బదులుగా బియ్యం ఇవ్వని మిల్లర్లపై ఆర్ఆర్ యాక్ట్ ప్రకారం ఎందుకు ఆస్తులు జప్తు చేయకూడదని అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలోని ఆరు రైస్‌మిల్లుల యజమాని ఆస్తులు బహిరంగ వేలం వేస్తున్నట్లు మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా ప్రకటించారు.

1.87లక్షల మెట్రిక్ టన్నులు ఇవ్వాలి

జిల్లాలో పౌరసరఫరాల శాఖ 2022-23 యాసంగి, వానాకాలం సీజన్లకు సంబంధించి 6,86,541 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రొక్యూర్ చేసి మిల్లులకు పంపించింది. ఇందులో యాసంగి సీజన్ 2,99,858మెట్రిక్ టన్నులు, వానాకాలంసీజన్ 3,86,683 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సీఎంఆర్ కోసం జిల్లాలోని 160 రైస్‌మిల్లులకు పౌర సరఫరాల శాఖ కేటాయించింది. మిల్లింగ్ చేసిన తర్వాత 68 శాతం బాయిల్డ్ రైస్, 67 శాతం రా రైస్ ఫుడ్‌కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎఫ్‌సీఐ)కి ఇవ్వాలి. అయితే యాసంగి సీజన్ బియ్యం 36,718 మెట్రిక్ టన్నులే వచ్చాయి. అదేవిధంగా వానాకాలం సీజన్‌కు సంబంధించి 2,27,594 మెట్రిక్ టన్నులు ఇచ్చారు. రెండు సీజన్లకు కలిపి ఇంకా 1,87,148 మెట్రిక్ టన్నుల బియ్యం జనవరి 31 కల్లా పౌరసరఫరాల శాఖకు ఇవ్వాలి. అయితే జిల్లాలో ఇంకా 45 మిల్లులు బియ్యం అందించలేదని అధికారులు చెబుతున్నారు. ఈ రైస్‌మిల్లులకు 2023-24 సంవత్సరానికి సంబంధించి సీఎంఆర్ కోటా నిలిపివేశారు.

మిల్లర్లను ఉపేక్షించేది లేదు

గడువులోగా మర ఆడించి బియ్యం ఇవ్వని మిల్లులపై కఠిన చర్యలు తీసుకుంటాం. జిల్లాలో ఇప్పటికే ఆరు మిల్లులపై కేసులు నమోదుచేశాం. సీఎంఆర్ లక్ష్యాన్ని చేరుకోని రైస్‌మిల్లులు 45 ఉన్నాయి. ఈ మిల్లర్లను ఉపేక్షించేది లేదు. సుమారు రూ.645 కోట్ల విలువ చేసే బియ్యం రైస్ మిల్లర్ల వద్దే ఉండిపోయింది. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

- హరికృష్ణ, సివిల్ సప్లయ్ డీఎం, మెదక్



డీడీఎస్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న పాత పంటల జాతర బుధవారం జహీరాబాద్ పట్టణానికి చేరుకున్నది. వ్యవసాయాధికారిని ప్రవీణ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అస్లాం ఫారూఖీ పాల్గొని చిరుధాన్యాల ప్రాధాన్యతను తెలియజేశారు.

- జహీరాబాద్, జనవరి 31

ప్రారంభించలేదా.. ఆపేయండి!

- ఎస్‌డీఎఫ్ పనులపై ఆదేశాలు
- అసంపూర్తిగా ఉంటే పూర్తి చేయండి
- జిల్లాలో వందల సంఖ్యలో పనులు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి సంగారెడ్డి, జనవరి 31 : ముఖ్యమంత్రి మంజూరు చేసిన స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్(ఎస్‌డీఎఫ్)పనులను ప్రారంభించకపోతే వెంటనే ఆపేయాలని జిల్లా అధికారులకు ప్రభుత్వం మౌఖిక ఆదేశాలిచ్చింది. 2022 ఫిబ్రవరిలో నారాయణఖేడ్‌లో జరిగిన సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకం పనుల శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లాలో అభివృద్ధి పనులకు ఎస్‌డీఎఫ్ ద్వారా నిధులను ప్రకటించారు. సంగారెడ్డి, జహీరాబాద్ మున్సిపాలిటీలకు రూ.50 కోట్ల చొప్పున, మిగిలిన మున్సిపాలిటీలకు రూ.25 కోట్ల చొప్పున, గ్రామ పంచాయతీలకు రూ.20 లక్షల చొప్పున మంజూరు చేశారు. సభ తర్వాత రెండు నెలలకు జిల్లాకు ఎస్‌డీఎఫ్ నుంచి నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ మేరకు జిల్లాలోని ఎనిమిది మున్సిపాలిటీలకు రూ.2.50 కోట్లు 647 గ్రామపంచాయతీలకు రూ.129.40 కోట్లను మంజూరయ్యాయి. ఈ నిధులతో మున్సిపాలిటీలో సీసీ రోడ్డు, మరుగు కాల్వలు, కల్వర్టులు తదితర అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉన్నది. మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల్లో పనుల గుర్తింపు, టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులను అదే ఏడాది జూన్, జూలై నెలలో ప్రారంభించారు. కొన్ని ప్రాంతాల్లో పూర్తయిన పనులకు బిల్లుల చెల్లింపులో జాప్యం నెలకొనడంతో ఈ ప్రభావం ఇతర పనులపై పడింది. చాలా ప్రాంతాల్లో పనులను చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. దాంతో మంజూరైన పనులు వందల సంఖ్యలో మొదలు కాలేదు. ఈలోగా అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ మొదలవడంతో అధికార యంత్రాంగం దృష్టి సారించలేకపోయింది. ఎన్నికల అనంతరం కొత్త ప్రభుత్వం అధికారంలోకి రాగా ఎస్‌డీఎఫ్ ద్వారా నిధుల మంజూరు, పనుల గురించి ఇటీవలే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్షించినట్టు తెలిసింది. ఎస్‌డీఎఫ్ ద్వారా మంజూరై పూర్తయిన పనులకు బిల్లులు చెల్లించాలని, ఎక్కడైనా అసంపూర్తిగా ఉంటే పూర్తి చేయించాలని సీఎం ఆదేశించినట్టు సమాచారం. అదే సమయంలో అసలే ప్రారంభించని పనులు ఉంటే వాటిని నిలిపివేయాలని చెప్పారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు ఉన్నతాధికారుల నుంచి జిల్లా అధికారులకు మౌఖికంగా ఆదేశాలు అందినట్టు తెలిసింది.

గద్దర్ విగ్రహావిష్కరణ





ప్రజాగాయకుడు గద్దర్ 76వ జయంతిని పురస్కరించుకుని రామచంద్రాపురం మండలం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఆయన విగ్రహాన్ని బుధవారం రాత్రి ఆవిష్కరించారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రొఫెసర్ కంచె అయిలయ్య, బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, గద్దర్ కుమార్తె వెన్నెల, కుమారుడు సూర్యకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

- రామచంద్రాపురం, జనవరి 31



నైతిక్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు

రాష్ట్రస్థాయి అబాకస్ పోటీలకు నైతిక్

దుబ్బాక, జనవరి 31: రాష్ట్రస్థాయి అబాకస్(స్పీడ్‌మ్యాస్) పోటీలకు సిద్దిపేట జిల్లా దుబ్బాకలోని సరస్వతీ గ్లోబల్ పాఠశాల విద్యార్థి నైతిక్ ఎంపికయ్యాడు. సిద్దిపేటలో జిల్లాస్థాయి అబాకస్ (స్పీడ్‌మ్యాస్) పోటీల్లో సత్తాచాటాడని ప్రిన్సిపాల్ రమేష్ తెలిపారు. బుధవారం ఆయన పాఠశాలలో మాట్లాడారు. త్వరలో రాష్ట్రస్థాయిలో జరిగే అబాకస్ పోటీల్లో పాల్గొంటాడని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు హేమచంద్ర ఎంపిక

● విద్యార్థిని అభినందించిన సర్పంచ్, హెచ్ఎం

చేర్యాల, జనవరి 31: చేర్యాల మండలం ముస్త్యాల జడ్పీఎస్ఎస్ 8వ తరగతి విద్యార్థి పి.హేమచంద్ర జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన 38వ తెలంగాణ సబ్ జూనియర్స్ ఎంపిక పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచాడు. దీంతో ఫిబ్రవరి 7 నుంచి 11వ తేదీ వరకు రాజస్థాన్ రాష్ట్రం చిత్తరుగర్డ్‌లో జరగబోయే జాతీయ పోటీలకు తెలంగాణ జట్టు తరఫున పాల్గొననున్నాడు. ఈ మేరకు బుధవారం పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సర్పంచ్ పెడుతల ఎల్లారెడ్డి, హెచ్ఎం పద్మలత, ఎస్ఎంసీ చైర్మన్ విజయ్ తదితరులు హేమచంద్రతోపాటు పీఈటీ కొండయ్యను అభినందించారు.

బస్వాపూర్‌లో ఫర్టిలైజర్ షాపుల తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్

కోహెడ, జనవరి 31: కోహెడ మండలం బస్వాపూర్ గ్రామంలోని ఫర్టిలైజర్ దుకాణాలను జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైసెన్స్ కలిగిన ప్రతి డీలర్ 10 టన్నుల యూరియాకు తగ్గకుండా స్టాక్ చూసుకోవాలన్నారు. ప్రతి డీలర్ పీవోఎస్ మెషీన్ ద్వారానే అమ్మకాలు జరపాలన్నారు. స్టాక్ బుక్, బిల్ బుక్ ప్రతి షాప్‌లో కలిగి ఉండాలని చెప్పారు. ఎరువులు కొనుగోలు చేసిన ప్రతీ రైతు తప్పకుండా బిల్ రశీదు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ తనిఖీలో మండల వ్యవసాయ అధికారి భోగేశ్వర్, విస్తరణ అధికారి కీర్తన ఉన్నారు.

పంటల వివరాలు తప్పకుండా నమోదు చేయించుకోవాలి

వర్గల్, జనవరి 31: రైతులు సాగుచేసిన పంటల వివరాలను వ్యవసాయాధికారులకు తెలియజేయాలని జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం వర్గల్ మండలం తునికిమక్తా గ్రామంలో వ్యవసాయ విస్తరణ అధికారులు నమోదు చేసిన పంటల వివరాలను పరిశీలించి మాట్లాడారు. పంట నమోదు ప్రక్రియను వ్యవసాయ విస్తరణ అధికారులు వేగవంతం చేయ్యాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శేషషయిని, విస్తరణ అధికారి ధర్మేందర్ పాల్గొన్నారు.

శనగ సాగులో విప్లవం..
నంద్యాల గ్రామ్-119

నంద్యాల టౌన్, జనవరి 31: నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఆవిష్కరించిన నంద్యాల గ్రామ్ (ఎన్‌బీఈజీ)-119 రకం శనగ రైతుల ఆర్థికాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోంది. 2015లో నంద్యాల ఆర్‌ఏఆర్‌ఎస్ నుంచి విడుదలైన నంద్యాల గ్రామ్-119 అత్యధిక విస్తీర్ణంలో సాగవుతోంది. ప్రకాశం జిల్లాలో మొత్తం సాగు విస్తీర్ణంలో 40 వేల హెక్టార్లల్లో నంద్యాల గ్రామ్ 119 సాగు చేస్తున్నారు. ఎకరానికి 10-12 క్వింటాళ్ల దిగుబడి ఇస్తూ.. స్వల్పకాలిక రకం కావడంతో రాయలసీమ జిల్లాల్లో సైతం ఈ రకం సాగు అధికంగా ఉంది. చీడ, పీడలను తట్టుకునే సామర్థ్యం, తక్కువ కాలంలో పంట వచ్చే నంద్యాల గ్రామ్-119 ముున్ముందు మరింత విస్తృత స్థాయిలో సాగయ్యే అవకాశం ఉన్నట్లు నంద్యాల ఆర్‌ఏఆర్‌ఎస్ శనగ ప్రధాన శాస్త్రవేత్త వి.జయలక్ష్మి చెప్పారు. 95 రోజుల స్వల్పకాలిక కాబూలి శనగ రకం, 100 గింజల బరువు 38-40 గ్రాములు, గింజ లావుగా, ఆకర్షణీయంగా ఉంటుందని తెలిపారు. హెక్టారుకు వర్షాధారంలో 17.5-20 క్వింటాళ్లు, 1 లేదా 2 తడులతో 20-25 క్వింటాళ్ల దిగుబడితో ఎండు తెగులును తట్టుకునే శక్తి ఈ రకానికి ఉందన్నారు.

పదవ తరగతి పరీక్షల్లో మార్పు

● సైన్స్ సబ్జెక్టులకు వేర్వేరుగా పరీక్షలు

చిన్నకోడూరు, జనవరి 31: పదవ తరగతి పరీక్షల షెడ్యూలులో ప్రభుత్వం ఈసారి స్వల్ప మార్పులు చేసింది. గతంలో ప్రతీ పరీక్షను ఒక్కో రోజు నిర్వహించగా ఈసారి ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్ పరీక్షలను రెండు వేర్వేరు రోజుల్లో నిర్వహించనుంది. మిగతా సబ్జెక్టుల 100 మార్కులకు (ఇంటర్నల్ 20 మార్కులు కలుపుకుని) పరీక్ష నిర్వహిస్తుండగా, సైన్స్ సబ్జెక్టులను రెండు పరీక్షలుగా విభజించి ఒక్కో పరీక్ష 50 మార్కులకు (ఇంటర్నల్ 10 మార్కులు కలుపుకోని) నిర్వహించనుంది. ఈ నూతన విధానంతో విద్యార్థులపై ఒత్తిడి తగ్గనుంది.

రెండేళ్లుగా ఒకే పరీక్ష

గత రెండు సంవత్సరాలుగా ఈ రెండు పేపర్లకు ఒకే పరీక్షగా, ఒకే రోజున నిర్వహించారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్, గణితం, సాంఘిక శాస్త్ర సబ్జెక్టులను ఒక్కొక్క ఉపాధ్యాయుడు బోధిస్తుండగా సైన్స్ సబ్జెక్టులైన ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్ సబ్జెక్టులను వేర్వేరు ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. దీంతో పరీక్షలు వేర్వేరుగా ఉండాలనే వినతులు రాగా రాష్ట్ర ప్రభుత్వం, పాఠశాల విద్యాశాఖ నిర్ణయం తీసుకుంది. ఒక్కో పరీక్షకు 50 మార్కులకు చొప్పున రెండు పరీక్షలను నిర్వహించనున్నారు. కరోనా కంటే ముందు హిందీ సబ్జెక్టు మినహా మిగతా అన్ని సబ్జెక్టులకు రెండు వేర్వేరు పరీక్షలు 50 మార్కుల చొప్పున నిర్వహించేవారు. కరోనా అనంతరం అన్ని సబ్జెక్టులకు ఒక్కో పరీక్షగా రెండేళ్లుగా నిర్వహిస్తున్నారు. కాగా ఈసారి భిన్నంగా మిగతా అన్ని సబ్జెక్టులకు ఒక్కో పరీక్షను ఫిజికల్, బయోలాజికల్ సైన్స్ సబ్జెక్టులకు మాత్రం ప్రత్యేకంగా వేర్వేరు రోజుల్లో పరీక్ష నిర్వహించడానికి టైం టేబుల్ విడుదలైంది. మార్చి 18 నుంచి పదవ తరగతి పరీక్షలు ప్రారంభం కానుండగా ఫిజికల్ సైన్స్ పరీక్ష మార్చి 26న, బయోలాజికల్ సైన్స్ పరీక్ష 28న జరగనుంది.


పదవతరగతి పరీక్ష రాస్తున్న విద్యార్థులు (ఫైల్)

నగలు దోచుకునేందుకే
కొల్గూరులో మహిళ హత్య

● నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

గజ్వేల్, జనవరి 31: ఈ నెల 26న కలకలం రేపిన గజ్వేల్ మండలం కొల్గూరు గ్రామానికి చెందిన మహిళ హత్య కేసును గజ్వేల్ పోలీసులు ఛేదించారు. గజ్వేల్ సీఐ బి.సైదా బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. గజ్వేల్ పట్టణానికి చెందిన సుంకరి భాను(30)కు అహ్మదీపూర్ గ్రామానికి చెందిన శ్యామలతో 2017లో వివాహం జరిగింది. వారికి ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. భాను అనేక వ్యాపారాలు చేసినా నష్టం వాటిల్లడంతో అప్పులు పెరిగిపోయాయి. వాటిని తీర్చే మార్గం లేక మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో ఇటీవల జరిగిన ఎన్నికల సమయంలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ 11వ వార్డు కౌన్సిలర్ గంగిశెట్టి చందన-రవిందర్ ఇంట్లో బెదిరింపు లేఖను వదిలాడు. ఈ విషయంలో సైతం కేసు నమోదైంది. అనంతరం ప్రతీరోజు సాయంత్రం కల్లు తాగేందుకు అలవాటుపడిన భాను.. కొల్గూరులోని ఓ కిరాణ దుకాణ యజమాని చెన్న శ్యామల(52)తో పరిచయం పెంచుకున్నాడు. ఆమె ఇంట్లో శ్యామల, ఆమె భర్త శ్రీనివాస్ ఇద్దరే ఉంటారని గమనించాడు. శ్యామల మెడలోని బంగారాన్ని దోచుకోవాలనే ఉద్దేశంతో ఈ నెల 26న ఉదయం ఆమె బాత్‌రూంకు వెళ్లగా భాను ఇంట్లోకి చొరబడి దుకాణంలోని నగదును దొంగలించాడు. అనంతరం బాత్‌రూం నుంచి తిరిగి వస్తున్న శ్యామల ముఖాన్ని దిండుతో అదిమిపట్టడంతో మృతిచెందింది. వెంటనే ఆమె ఒంటిపై ఉన్న బంగారు నగలను దోచుకుని వెళ్లాడు. ఈ కేసు విషయమై సీపీ అనురాధ ఆదేశాల మేరకు గజ్వేల్ ఏసీపీ రమేశ్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి, దర్యాప్తు చేపట్టారు. బుధవారం భానును పట్టుకుని విచారించగా నేరం ఒప్పుకున్నట్లు సీఐ తెలిపారు. భాను నుంచి మూడున్నర తులాల బంగారు పుస్తెలతాడు, కమ్మలు, రూ.54వేల నగదు స్వాధీనం చేసుకున్నామని, నిందితుడిని రిమాండ్‌కు తరలించామని సీఐ సైదా తెలిపారు. కేసును ఛేదించడంలో కీలకపాత్ర వహించిన గజ్వేల్ ఏసీపీ రమేశ్, సీఐ సైదా, ఎస్ఐ పరశురాం, తొగుట హెడ్ కానిస్టేబుల్ యాదగిరి, గజ్వేల్ క్రైమ్ కానిస్టేబుళ్లు నవీన్, రామోళ్ల వెంకటేశ్, నరేందర్, రవిలను సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ అభినందించారు.

పురుగుల మందు చెవిలో పోసుకొని ఆత్మహత్య


నారాయణరెడ్డి (ఫైల్)

అక్కన్నపేట, జనవరి 31: అన్నదమ్ముల మధ్య భూ తగాదాలతో మనస్తాపం చెందిన వ్యక్తి పురుగుల మందు చెవిలో పోసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అక్కన్నపేట మండలం కట్కూర్ గ్రామానికి చెందిన జిల్లెల్ల నారాయణరెడ్డి(75)కి ఆయన సోదరుడికి మధ్య భూ తగాదాలు నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం వారి మధ్య గొడవ జరిగింది. తీవ్ర మనస్తాపం చెందిన నారాయణరెడ్డి మంగళవారం రాత్రి ఇంట్లోని పురుగుల మందును చెవిలో పోసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య సుశీల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తాండ్ర వివేక్ తెలిపారు.

గంజాయి చాక్లెట్ల కలకలం

● చేర్యాలలో కళాశాల పక్కనున్న పాన్‌షాపులో విక్రయం
● 1,200 గంజాయి చాకెట్లు పట్టివేత
● విక్రయదారుడి అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు

చేర్యాల, జనవరి 31: సిద్దిపేట జిల్లా చేర్యాల ఆర్టీసీ బస్టాండు, కళాశాల సమీపంలోని ఓ పాన్‌షాప్ నిర్వాహకుడు గుట్టుచప్పుడు కాకుండా గంజాయి విక్రయిస్తుండటం కలకలం రేపింది. సదరు షాపులో గంజాయి చాక్లెట్లను ఎక్సైజ్ అధికారులు బుధవారం పట్టుకుని నిర్వాహకుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. ఎక్సైజ్ సీఐ మహేంద్రకుమార్ వివరాలను వెల్లడించారు. బీహార్‌కు చెందిన రాకేశ్‌కుమార్ కొంతకాలంగా ఆర్టీసీ బస్టాండు సమీపంలోని ఓ హోటల్ ఆవరణలో పాన్‌షాపును నిర్వహిస్తున్నాడు. బీహార్ నుంచి గంజాయి చాక్లెట్లు అతి తక్కువ ధరకు తీసుకొచ్చి స్థానికంగా పనులు చేసుకుంటున్న బీహార్ కూలీలు, ఇతరులకు విక్రయిస్తున్నాడు. ఒక్కో చాక్లెట్‌లో 13 శాతం గంజాయి ఉంటుంది. నమ్మదగిన సమాచారం రావడంతో బుధవారం పోలీసులు దాడులు చేపట్టగా 30 ప్యాకెట్లు పట్టుబడ్డాయి. ఒక్కో ప్యాకెట్‌లో 40 చాక్లెట్లు ఉండగా మొత్తం 6 కిలోల పరిమాణం గల 1200 చాక్లెట్లు స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. వీటి విలువ సుమారు రూ.90 వేలు ఉంటుందన్నారు. నిర్వాహకుడు రాకేష్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు వినోద్ కుమార్, సురేశ్ పాల్గొన్నారు.


చేర్యాల పట్టణంలో నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

హత్నూరలో..

హత్నూర: సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం మల్కాపూర్‌లో బుధవారం ఎండు గంజాయి, మత్తు చాక్లెట్లలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన ఓ కుటుంబం గత కొంత కాలంగా హత్నూర మండలం మల్కాపూర్ గ్రామ శివారులో గల ఓ వ్యవసాయ క్షేత్రంలో నివాసముంటున్నారు. సమీప ప్రాంతంలోని పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికులకు గంజాయి, మత్తు చాక్లెట్లు విక్రయిస్తున్నారు. ఈ మేరకు సమాచారం అందడంతో బుధవారం పోలీసులు దాడి చేసి, కిలోన్నర ఎండు గంజాయితో పాటు మత్తు పదార్థాలు కలిపి తయారు చేసిన చాక్లెట్లలను స్వాధీనం చేసుకున్నారు. గంజాయి విక్రయిస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


హత్నూరలో గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు

ఈవీఎంలు సిద్ధం చేయండి

● రాష్ట్ర అదనపు ఎన్నికల అధికారి లోకేష్‌కుమార్

మెదక్ అర్బన్, జనవరి 31: పార్లమెంట్ ఎన్నికలు రానున్న సందర్భంగా జిల్లా యంత్రాంగం ఈవీఎంల ఏర్పాట్లను పూర్తి చేయాలని రాష్ట్ర అదనపు ఎన్నికల అధికారి లోకేష్‌కుమార్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ.. జిల్లాలోని నియోజకవర్గాల వారీగా అవసరమైన ఈవీఎంలను, వీవీప్యాట్‌లను కేటాయించాలన్నారు. ఇందుకు సిబ్బంది కేటాయింపు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈవీఎంలలో సమస్యలు ఉంటే ఈసీఐ దృష్టికి తీసుకురావాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ.. జిల్లాలో ఈవీఎం, వీవీ ప్యాట్ల కోసం ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.

మహిళా డిగ్రీ కళాశాలకు రక్షణ కల్పించండి

సంగారెడ్డి రూరల్, జనవరి 31: సంగారెడ్డి పట్టణంలో ఉన్న మహిళా డిగ్రీ కళాశాలకు రక్షణ కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్ ఏవో పరమేశంకు వినతిపత్రాన్ని అందజేసి మాట్లాడారు. మహిళా డిగ్రీ కళాశాల ప్రహరీని కొందరు వ్యక్తులు ధ్వంసం చేసి లోనికి ప్రవేశిస్తుండడంతో విద్యార్థినులు భయభ్రాంతులకు గురవుతున్నారని చెప్పారు. కళాశాల ఆవరణలో ప్రహరీని నిర్మించి, సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని కోరారు. బయటి వ్యక్తులు అక్రమంగా లోనికి రాకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రాన్ని అందజేసిన వారిలో రవికిరణ్‌గౌడ్, వాణి తదితరులు ఉన్నారు.


ఏవో పరమేశంకు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

చట్టసభలకు వెళ్లకుండా కోదండరాంపై కేసీఆర్ కుట్ర

● టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు తుల్జారెడ్డి
● సంగారెడ్డిలో మాజీ సీఎం దిష్టిబొమ్మ దహనం

సంగారెడ్డి అర్బన్, జనవరి 31: చట్టసభలకు వెళ్లకుండా కోదండరాంపై మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ కుట్ర పన్నిందని తెలంగాణ జన సమితి(టీజేఎస్) జిల్లా అధ్యక్షుడు పాతదొడ్డి తుల్జారెడ్డి ఆరోపించారు. సంగారెడ్డిలోని ఐబీ వద్ద టీజేఎస్ ఆధ్వర్యంలో బుధవారం మాజీ సీఎం కేసీఆర్ చిత్రపటాన్ని దహనం చేశారు. ఈ సందర్భంగా తుల్జారెడ్డి మాట్లాడుతూ.. టీజేఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు కోదండరాంను గౌరవించి కాంగ్రెస్ పార్టీ గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నియమిస్తే ప్రమాణ స్వీకారం చేయకుండా కోర్టుకెళ్లి అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. ప్రజలు కర్రుకాల్చి వాత పెట్టినా బీఆర్ఎస్‌కు సిగ్గు రావడం లేదని, ఇలాంటి కుట్రలు సమాజానికి శ్రేయస్కరం కాదని హితవుపలికారు. ఈ కార్యక్రమంలో టీజేఎస్ ప్రధాన కార్యదర్శి సాయిలు, నాయకులు శ్రీధర్‌మహేంద్ర, విష్ణువర్ధన్‌రెడ్డి, శశికాంత్, రాంరెడ్డి పాల్గొన్నారు.


కేసీఆర్ చిత్రపటాన్ని దహనం చేస్తున్న టీజేఎస్ నాయకులు

ఉత్సాహంగా సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు

● రాష్ట్రస్థాయికి 25మంది క్రీడాకారుల ఎంపిక

మెదక్ అర్బన్, జనవరి 31: మెదక్ పట్టణంలోని ఇందిరాగాంధీ మైదానంలో 9వ తెలంగాణ స్టేట్ జూనియర్ అథ్లెటిక్స్ జిల్లాస్థాయి పోటీలు బుధవారం ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 250 మంది క్రీడాకారులు హాజరయ్యారు. అండర్-8, 10, 12, 14 బాల బాలికలకు రన్నింగ్, త్రో, జంపింగ్ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 25 మందిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. ఫిబ్రవరిలో కొత్తగూడెం జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వారు పాల్గొంటారని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి మధుసూదన్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి సుభాస్‌చంద్రబోస్, మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి రాజేందర్, కోచ్ పృథ్వీ, సుమన్, పీఈటీలు మమత, చంటీ పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో నారాయణపూర్‌కు ప్రథమ బహుమతి

నర్సాపూర్: మెదక్‌లో నిర్వహించిన సబ్‌జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో మండలంలోని నారాయణపూర్ పాఠశాల విద్యార్థులు పరుగుపందెంలో ప్రథమ బహుమతి పొంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఉపాధ్యాయుడు ఎల్.శ్రీనివాస్‌జాదవ్ తెలిపారు. పి.వరునిక 300మీటర్లు, 50మీటర్ల పరుగుపందెంలో ప్రథమ బహుమతి పొందినట్లు చెప్పారు. బ్రాడ్ జంప్‌లో పి.లాస్య ప్రథమ స్థానం పొందినట్లు చెప్పారు. వీరు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనందు పాఠశాల తరుపున ప్రత్యేకంగా అభినందించారు.


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ఉపాధి హామీ పనులపై ప్రజాదర్బార్

చిన్నశంకరంపేట, జనవరి 31: చిన్నశంకరంపేట మండలంలోని 29 గ్రామ పంచాయతీల్లో ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన పనులపై బుధవారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో డీఆర్డీవో పీడీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ, ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.6కోట్ల 50 లక్షల పనులు చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా చేపట్టిన ఇంకుడు గుంతలను, మరుగుదొడ్ల నిర్మాణాల విషయంలో గ్రామపంచాయతీల్లో అవకతవకలు జరిగినట్లు వివరించారు. డీఆర్డీవో శ్రీనివాస్ మాట్లాడుతూ.. గ్రామపంచాయతీల్లో చేపట్టిన పనుల్లో అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. పనుల్లో నిర్లక్ష్యం వహించిన వారికి రూ.1500 జరిమానా, రూ.లక్షా 20వేలు రికవరీ చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ పీడీ విరోజ, ఎంపీడీవో ప్రవీణ్, హెచ్‌ఆర్ మేనేజర్ రాజేందర్‌రెడ్డి, క్యూసీ దేవేందర్, ఏపీవో వెంకటసాయిగౌడ్, ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం మండలాధ్యక్షుడు నాగభూషనం, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించడంలో కేంద్రం విఫలం

● సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు,

నారాయణఖేడ్, జనవరి 31: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులు, రైతు వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు, జిల్లా మాజీ అధ్యక్షుడు మాణిక్యం విమర్శించారు. బుధవారం నారాయణఖేడ్‌లో ఏర్పాటు చేసిన కార్మికుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా సమ్మె నిర్వహించనున్నామన్నారు. సమ్మెను జయప్రదం చేయడానికి అన్ని వర్గాల వారు సహకరించాలని కోరారు. కేంద్రంలోని మోదీ సర్కార్‌ను గద్దె దించినప్పుడే అన్ని వర్గాల వారికి మంచి రోజులు వస్తాయన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల యూనియన్ నాయకులు నాగేశ్వరి, అనురాధ, స్వరూప, మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు ప్రసాద్, రాజు పాల్గొన్నారు.

రైతునేస్తంగా 'సుష్మ' ప్రయోగం

● దక్షిణ భారత విజ్ఞాన సదస్సులో ప్రదర్శన

జగదేవ్‌పూర్, జనవరి 31: సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం దామరకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న సుష్మ తయారు చేసిన పరికరం రైతునేస్తంగా మారింది. 2023 రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శనకు సంబంధించి జిల్లాస్థాయి పోటీల్లో సుష్మ తయారు చేసిన పరికరం జిల్లా, రాష్ట్రస్థాయిల్లో ఎంపికై దక్షిణ భారతదేశ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైంది. జనవరి 27 నుంచి ఫిబ్రవరి 1 వరకు ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో జరుగుతున్న దక్షిణ భారతదేశస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రదర్శిస్తున్నారు. మూడు చక్రాలతో కూడిన ఒక వాహనంపై 25 లీటర్ల ఖాళీ క్యాన్‌ను బిగించారు. ఈ ఖాళీ క్యాన్‌లో ఎరువును నింపి పంట చేనుకు ఇరువైపులా ఎరువులు చల్లేలా తీర్చిదిద్దింది. ఈ ప్రయోగం ద్వారా ఒకేసారి రెండు వరుసల్లో ఎరువు వేసే విధంగా పరికరాన్ని రూపొందించారు. ఈ పరికరం రైతు నేస్తంగా ఉండడంతో పాటు బహుళ ప్రయోజనం అందించనున్నది. పాఠశాల ఫిజికల్ ఉపాధ్యాయుడు చిన్నబ్రహ్మయ్య గైడ్‌గా ఉండి పరికరాన్ని తీర్చిదిద్దారు.


సుష్మ తయారు చేసిన పరికరం


వైజ్ఞానిక ప్రదర్శనలో పరికరం విధానాన్ని వివరిస్తున్న సుష్మ

బీజేపీ ఆధ్వర్యంలో 'గావ్ చలో అభియాన్' వర్క్‌షాప్



మాట్లాడుతున్న రాష్ట్ర ఇన్‌చార్జి రంజిత్‌మోహన్

సంగారెడ్డి అర్బన్, జనవరి 31 : సంగారెడ్డి చౌరస్తా సమీపంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పిలుపు మేరకు 'గావ్ చలో అభియాన్' వర్క్‌షాప్‌ను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఇన్‌చార్జి రంజిత్‌మోహన్, జిల్లా అధ్యక్షురాలు గోదావరి మాట్లాడుతూ... బూత్‌స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని, ఒక రోజంతా బీజేపీ నాయకులు బూత్‌లో గడపాలని, కమిటీలు లేనిచోట్ల ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ హనుమంత్‌రెడ్డి, కో కన్వీనర్ చంద్రశేఖర్, రాష్ట్ర కార్యవర్గసభ్యులు రవీందర్, రమేశ్, రవికుమార్ గౌడ్, నాయకులు అనంతరావు కులకర్ణి, మాణిక్‌రావు, రాజశేఖర్‌రెడ్డి, రాములు, వెంకటనర్సింహ్మారెడ్డి, డా.రాజుగౌడ్, దోమల విజయ్‌కుమార్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా కార్యవర్గంలో పలువురికి చోటు

సంగారెడ్డి అర్బన్: బీజేపీ జిల్లా కార్యవర్గంలో పలువురుకి చోటుదక్కింది. ఈ మేరకు జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి బుధవారం వారి వివరాలను ప్రకటించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులుగా పులిమామిడిరాజు, మల్లికార్జున్ పాటిల్, వి.ప్రతాప్‌రెడ్డి, అధికార ప్రతినిధిగా డాక్టర్ రాజుగౌడ్, కార్యదర్శిగా అరుణకౌలాస్, కార్యాలయ కార్యదర్శిగా దోమల విజయ్‌కుమార్, కోశాధికారిగా చంద్రశేఖర్‌గుప్తాలకు చోటుదక్కింది.

కాంగ్రెస్ పార్టీ నుంచి ఒకరి సస్పెన్షన్

తూప్రాన్, జనవరి 31: తూప్రాన్ పట్టణానికి చెందిన రేపల్లె యాదగిరిని కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి ప్రకటించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి నిజాయితీ కలిగిన వ్యక్తులు అవసరమన్నారు. వివరాలు తెలియకుండా యాదగిరిని పార్టీలో చేర్చుకున్నామని, ఇలాంటి వ్యక్తులకు పార్టీలో అవకాశం లేదన్నారు.

ప్రభుత్వం ఎక్కువ కాలం నిలబడుతుందన్న నమ్మకం లేదు

● నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి

శివ్వంపేట, జనవరి 31: కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కువ కాలం నిలబడుతుందన్న నమ్మకం లేకుండా పోతుందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రమైన శివ్వంపేటలో కూరగాయల మార్కెట్, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీరోడ్లు తదితర పనులను ప్రారంభించారు. గోమారంలోని పాలిటెక్నిక్ విద్యార్థుల కోసం నిర్మించిన వసతిగృహాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమైందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలపై ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ఎప్పటికప్పుడు ఎండగడుతూ నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మహేష్ గుప్తా, ఎంపీపీ హరికృష్ణ, సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, జడ్పీ కోఆప్షన్ మన్సూర్, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రామ్‌రెడ్డి, ఉపసర్పంచ్ పద్మవెంకటేశ్, నాయకులు చంద్రాగౌడ్, లావణ్యమాధవరెడ్డి, పిట్లసత్యనారాయణ, నర్సింహారెడ్డి, మహేందర్‌రెడ్డి, లక్ష్మీనర్సయ్య, కొండల్, పోచాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

వెల్దుర్తి: కల్యాణలక్ష్మి పేదలకు ఒక వరమని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎంపీపీ స్వరూప నరేందర్‌రెడ్డి, జడ్పీటీసీ రమేష్‌లతో కలిసి ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అలాగే మండల పరిధిలోని ఆరెగూడెం గ్రామంలో కురమ సంఘం భవన నిర్మాణానికి శంకుస్థాపన, బస్వాపూర్ గ్రామంలోని ముదిరాజ్ సంఘం, వైకుంఠధామం, పంతులపల్లి సీసీ రోడ్డులను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ అనంతరెడ్డి, వైస్ ఎంపీపీ సుధాకర్‌గౌడ్, వెల్దుర్తి సర్పంచ్ భాగ్యమ్మ, వెల్దుర్తి ఎంపీటీసీ మోహన్‌రెడ్డి, తహసీల్దార్ తులసీరామ్, ఎంపీడీవో వెంకటలక్ష్మమ్మ పాల్గొన్నారు.

ప్రజావసరాలకు అనుగుణంగా గ్రామాల అభివృద్ధి: ఎమ్మెల్యే

గుమ్మడిదల, జనవరి 31: ప్రజల అవసరాలు, ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతూ ప్రణాళికబద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. గుమ్మడిదల మండల పరిధిలోని బొంతపల్లి, వీరన్నగూడెం, గుమ్మడిదల గ్రామాల్లో 2కోట్ల 20లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్లు, బీసీ కమ్యూనిటీ హాల్, వీధి దీపాలను స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న నిధులతో పాటు పరిశ్రమల సహకారంతో శరవేగంగా అభివృద్ధి పనులు పూర్తి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రవీణా విజయభాస్కర్ రెడ్డి, జడ్పీటీసీ కుమార్‌గౌడ్, సద్ది విజయభాస్కర్‌రెడ్డి, ఆలేటి శ్రీనివాస్ రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికబద్ధంగా గ్రామాల అభివృద్ధి

జిన్నారం: ప్రజల అవసరాలకు అనుగుణంగా నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం సోలక్ పల్లి పంచాయతీ పరిధిలోని హిమామ్‌నగర్‌లో 25లక్షలతో చేపట్టిన తెలంగాణ క్రీడా ప్రాంగణం, పల్లె ప్రకృతి వనం, యూజీడీ పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, సర్పంచ్ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీటీసీ స్వాతి ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బొంతపల్లి గ్రామంలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పదేళ్లలో మారిన గ్రామాల రూపురేఖలు

పటాన్‌చెరు: పదేళ్లలో నియోజకవర్గంలోని గ్రామాల రూపురేఖలు సమూలంగా మారిపోయాయని ఎమ్మెల్యే గూడెంమహిపాల్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని చిన్నకంజర్ల గ్రామంలో 3.70కోట్ల వ్యయంతో నిర్మించిన కమ్యూనిటీ ఫంక్షన్‌హాల్, మహిళాభవనం, సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ పనులను పంచాయతీ పాలకవర్గంతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు సమస్యలకు నిలయంగా ఉన్న గ్రామాలు నేడు పట్టణాలకు తీసిపోని విధంగా మౌలిక వసతులు సమకూరాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజ్‌కుమార్, జడ్పీటీసీ సుప్రజవెంకట్‌రెడ్డి, ఎంపీటీసీ నారాయణరెడ్డి, డీఈ సురేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే

పటాన్‌చెరు రూరల్: ముత్తంగి గ్రామంలో 20 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన పల్లె దవాఖాన ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్, 15 లక్షల రూపాయలతో నిర్మించిన మహిళా సమైక్య భవనాలను ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఆధునిక వైద్య సేవలు అందించడంలో పల్లె దవఖానాలు ఉపకరిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో జడ్పిటిసి సుప్రజా వెంకట్ రెడ్డి, గ్రామ సర్పంచ్ ఉపేందర్, ఆత్మ కమిటీ చైర్మన్ కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

అధికారులను బదిలీ చేయించండి

● జగ్గారెడ్డికి కాంగ్రెస్ నాయకుల వినతి

ఆంధ్రజ్యోతి ప్రతినిధి సంగారెడ్డి, జనవరి 31 : సంగారెడ్డి నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌కు అనుకూలంగా వ్యవహరించిన రెవెన్యూ, పోలీస్ అధికారులను బదిలీ చేయించాలని పలువురు కాంగ్రెస్ నాయకులు మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డిని కోరారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు బదిలీపై ఇక్కడకు వచ్చిన రెవెన్యూ ఉన్నతాధికారితో పాటు పోలీసు అధికారులు బీఆర్‌ఎస్ అభ్యర్థికి అనుకూలంగా పనిచేశారని వారు జగ్గారెడ్డి దృష్టికి తీసుకవచ్చారు. పోలింగ్ ముందు రోజు, పోలింగ్ రోజు కూడా బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నారని తాము ఫిర్యాదు చేసినా అస్సలు పట్టించుకోలేదని వారు జగ్గారెడ్డికి ఫిర్యాదు చేశారు. ఆ అధికారులు అలాగే కొనసాగితే పార్లమెంట్ ఎన్నికల్లో ఇబ్బంది తప్పదని వారు తెలిపారు. ఇందుకు స్పందించిన మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి త్వరలోనే ప్రభుత్వ పెద్దలతో మాట్లాడుతానని చెప్పినట్టు పలువురు నాయకులు తెలిపారు.

రామాంతపూర్‌లో పంటల పరిశీలన

మాసాయిపేట, జనవరి 31: మాసాయిపేట మండలం రామాంతపూర్ గ్రామంలో వరి పంటలను మాసాయిపేట మండల వ్యవసాయ అధికారి రాజశేఖర్ బుధవారం పరిశీలించారు. వరిపంటలో మోవి పురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఆయన రైతులకు సూచించారు. మోగి పురుగు ఆశించకుండా కార్బోఫిరాన్‌ఫోర్‌జి గుళికలు 600 గ్రాములు నాలుగు మందు లేదా కార్బోఫిరాన్ 5జి గుళికలు లేదా నార్మల్‌లో వేస్తే పురుగులు పంటలను ఆశించే అవకాశాలు ఉండాలని రైతులు జాగ్రత్త పాటించి నారుమడిలో జాగ్రత్తలు తీసుకోవాలని చీడపీడలు రాకుండా మందులు పిచికారి చేయాలని ఆయన ఈ సందర్భంగా రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈవో రజిత, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

వైభవంగా నల్లపోచమ్మ ఉత్సవాలు



ఉత్సవాల్లో పాల్గొన్న మాధవానందస్వామి


నర్సాపూర్, జనవరి 31: నర్సాపూర్‌లోని ప్రముఖ ఆలయమైన నల్లపోచమ్మ వార్షికోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ప్రత్యేక పూజలో రాంపూర్ పీఠాధిపతి మాధవానందస్వామి పాల్గొని పూజలు నిర్వహించారు. తల్లిదండ్రుల పట్ల ప్రేమ ఆప్యాయతలతో పాటు సంస్కృతి సంప్రదాయాలను దూరం చేసుకోకుండా ఈర్ష ద్వేషాలకు దూరంగా ఉండాలని సూచించారు. మొదటిరోజు ఉత్సవాల్లో మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, ముదిరాజ్‌సంఘం రాష్ట్ర నాయకులు నీలంమధు, మాజీ ఎంపీపీ రమణారావు, ఆలయ నిర్వాహక కమిటీ ప్రతినిధులు దండుదశరత్, జగదీష్, గోవర్ధన్‌రెడ్డి, శ్రీశైలంయాదవ్, శ్రీనివాస్, కొండిదుర్గేష్ తదితరులతో పాటు పూజారులు హరిప్రసాద్‌శర్మతో పాటు పలువురు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడి లేకుండా చదువుల్లో రాణించాలి

● సైకాలజిస్టు డా.శరత్

సంగారెడ్డి అర్బన్, జనవరి 31 : మానసిక ఒత్తిడి లేకుండా విద్యార్థులు చదువుల్లో రాణించాలని సైకాలజిస్టు డా.శరత్ సూచించారు. సంగారెడ్డిలోని బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో 'విద్యార్థుల ఆత్మహత్యలు ఇంకా ఎన్నాళ్లు' అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సైకాలజిస్టు డా.శరత్ మాట్లాడుతూ విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికాకుండా జీవితంలో ఉన్నతంగా ఎదగాలన్నారు. ఆర్థిక పరిస్థితులు ఎదుగుదలకు కారణం కాకూడదన్నారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేశ్ మాట్లాడుతూ విద్యార్థులు చదువు, ఉద్యోగాలే కాకుండా పోరాటాల వైపు ఆకర్షితులై నిలబడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా నాయకురాలు ప్రశాంతి, కళాశాల ప్రిన్సిపాల్ సునీత, పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు సందీప్, నాయకులు అర్జున్, సిద్దేశ్వర్, సమీ, తదితరులు పాల్గొన్నారు.

మెదక్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడి మృతి



జెన్నారెడ్డి(ఫైల్)

మెదక్ అర్బన్, జనవరి 31: సీనియర్ న్యాయవాది, మెదక్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జెన్నారెడ్డి(58) గుండెపోటుతో మృతిచెందారు. మూత్ర సంబంధ ఇబ్బందులతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరారు. చికిత్స పొందుతూ.. గుండెపోటుతో బుధవారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచినట్లు న్యాయవాదులు తెలిపారు. ఆయన మృతి పట్ల సీనియర్ న్యాయవాదులు పోచయ్య, రవీందర్, లక్ష్మణ్, ఫజిల్, సంతోష్‌రెడ్డిలు సంతాపం తెలిపారు.

నూతన భవనాలను ప్రారంభించిన సర్పంచులు

చిన్నశంకరంపేట, జనవరి 31: చిన్నశంకరంపేట మండలంలోని పలు గ్రామాల్లో సర్పంచులు అభివృద్ధి పనులు, నూతన భవనాలను బుధవారం ప్రారంభించారు. చందంపేటలో హెల్త్ సెంటర్, భాగీర్థిపల్లిలో గ్రామ పంచాయతీ నూతన భవనాలను సర్పంచులు శ్రీలత స్వామిరాజ్, సూళ్ల దయానంద్ యాదవ్ పాలక వర్గాలతో కలిసి ప్రారంభించారు. అనంతరం సర్పంచుల పదవీ కాలం పూర్తి కావడంతో ఎంపీటీసీలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు సర్పంచులను, వార్డు సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు శివకుమార్, వైస్ ఎంపీపీ సత్యనారాయణగౌడ్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రాజు, ఎంపీటీసీ అనురాధ, గొండ స్వామి, సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

గిరిజనులను, తండాలను గర్తించింది కేసీఆరే

నిజాంపేట, జనవరి 31 : స్వరాష్ట్రం సాధించాక తండాలను గుర్తించి ప్రజల సౌలభ్యం కోసం గ్రామ పంచాయతీలు ఏర్పాటు చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కిందని సర్పంచ్ అరుణ్ కుమార్ అన్నారు. మండల పరిధిలోని జప్తిర్‌తండా గ్రామంలో బుధవారం రూ.20 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించిన గ్రామపంచాయతీ నూతన భవనాన్ని ఆయన ప్రారంభించారు. తండా అభివృద్ధికి కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ పాలకవర్గం సభ్యులు లక్కీ, జగన్, లక్ష్మా, బీఆర్ఎస్ నాయకులు మంగ్యా, తదితరులు పాల్గొన్నారు.

నేర రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యం: ఎస్పీ

సంగారెడ్డి క్రైం, జనవరి 31: సంగారెడ్డిని నేర రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యమని ఎస్పీ చెన్నూరి రూపేష్ అన్నారు. నేరాల అదుపునకు పోలీసు అధికారులతో బుధవారం సాయంత్రం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేరాల అదుపునకు ఒక్కో విభాగానికి ఒక నోడల్ అధికారిని నియమించినట్లు తెలిపారు. సబ్ డివిజన్ల వారీగా షీ టీమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. సైబర్ మోసాలకు గురికాకుండా ప్రజలను అప్రమత్తం చేయడం కోసం కళా బృందాల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

● అల్లాదుర్గం సీఐ రేణుక

అల్లాదుర్గం, జనవరి 31 : రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని అల్లాదుర్గం సీఐ రేణుక స్పష్టం చేశారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో సర్కిల్ పరిధిలోని పెద్దశంకరంపేట, రేగోడ్, టేక్మాల్, అల్లాదుర్గం తదితర మండలాలలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యంతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్రైవర్ల నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదాల జరుగుతున్నాయన్నారు. ఈ సమావేశం అనంతరు పాఠశాలల యాజమాన్యం సీఐ రేణుకను శాలువాతో సత్కరించి సన్మానించారు. ఈ సమావేశంలో స్థానిక ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వెల్దుర్తి ఎస్ఐగా నవతగౌడ్



వెల్దుర్తి, జనవరి 31: వెల్దుర్తి ఎస్ఐగా నవతగౌడ్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు వెల్దుర్తి ఎస్ఐగా విధులు నిర్వర్తించిన ఎస్ఐ మధుసూదన్‌గౌడ్ మెదక్ ఎస్పీ ఆఫీసుకు బదిలీ అయ్యారు. రాజన్న సిరిసిల్లలో ఎస్‌బీ ఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్న నవతగౌడ్ బదిలీపై వెల్దుర్తికి వచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ నవతగౌడ్ మాట్లాడుతూ... శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలకు సహకరించాలని కోరారు. ప్రజలకు ఎలాంటి సమస్య వచ్చినా పరిష్కరించేందుకు తాను కృషి చేస్తానని చెప్పారు. ప్రతీ ఒక్కరూ పోలీసులకు సహకరించాలని ఎస్ఐ కోరారు.

నిజాం షుగర్ ఫ్యాక్టరీ పునఃప్రారంభంపై హర్షం

హవేళిఘణపూర్: మెదక్ నిజాం షుగర్ ఫ్యాక్టరీని పునఃప్రారంభించడం హర్షనీయమని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు లక్కరు శ్రీనివాస్, ఎంపిటీసీ శ్రీనివాస్ బుధవారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో చేపట్టిన పాదయాత్ర సందర్భంగా రేవంత్‌రెడ్డి ఈ ప్రాంత రైతులకు ఇచ్చిన హామీని నెరవేర్చేందుకు కృషి చేస్తున్నారని చెప్పారు. ఫ్యాక్టరీని తెరవడం పట్ల మెదక్ ప్రాంత రైతులు, నాయకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలోని రైతులు రెండు పంటలుగా వరి పంటను పండించడం వల్ల భూసారం తగ్గి లాభాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాటను నెరవేర్చేందుకు కమిటీని ఏర్పాటు చేయడం హర్షనీయమన్నారు.

సర్పంచులపై సస్పెన్షన్ వేటు

నిజాంపేట, జనవరి 31: నూతన పంచాయతీ భవన ప్రారంభోత్సవంలో ప్రొటోకాల్ పాటించని సర్పంచ్ సస్పెన్షన్‌కు గురయ్యారు. నిజాంపేట మండల పరిధిలోని జెడ్ చెరువు తండా గ్రామంలో పంచాయతీ నూతన భవనాన్ని సర్పంచ్ అరుణ్‌కుమార్ బుధవారం ప్రారంభించారు. ప్రొటోకాల్ పాటించనందున ఆయనను సస్పెండ్ చేస్తూ జిల్లా పంచాయతీ రాజ్ అధికారి ఉత్తర్వులు జారీ చేశారు. భవన ప్రారంభోత్సవంలో అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు రుజువైనందున సస్పెండ్ చేసినట్లు ఎంపీడీవో జగదీశ్వర్‌చారి తెలిపారు.

●చిన్నశంకరంపేట: మండలంలోని చందంపేట గ్రామంలో ప్రొటోకాల్ పాటించని సర్పంచ్ తాటికొండా శ్రీలత, పంచాయతీ కార్యదర్శిపై జిల్లా అధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. బుధవారం చందంపేటలో పల్లె దవాఖానాను సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి ప్రారంభించారు. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్ రాజార్షిషా ఆదేశాల మేరకు సర్పంచ్, పంచాయతీ కార్యదర్శిపై సస్పెన్షన్ వేటు వేశారు.

కాంగ్రెస్ ఫిర్యాదుతో నిలిచిన

పంచాయతీ భవన ప్రారంభోత్సవం

మనోహరాబాద్, జనవరి 31: ప్రొటోకాల్ పాటించలేదని కాళ్లకాల్ గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించకుండా వదిలేశారు. కాళ్లకల్‌లో గ్రామ పంచాయతీ భవనాన్ని రూ.65 లక్షలతో నిర్మించారు. సర్పంచ్‌ల పదవీకాలం బుధవారంతో ముగియనుండడంతో భవనాన్ని ప్రారంభించాలని సోమవారం జిల్లా కలెక్టర్ రాజార్షిను సర్పంచ్ నత్తి మల్లేష్, ఉప సర్పంచ్ రాజు యాదవ్ కలిసి విన్నవించారు. మంగళవారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు పంచాయతీ భవనం పనులు పూర్తి కాలేదని, పంచాయతీరాజ్ ఏఈ అనుమతి లేకుండా శిలాఫలకం ఏర్పాటు చేశారంటూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు భవన ప్రారంభోత్సవాన్ని నిలిపివేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

కొప్పులపల్లిలో పౌర హక్కుల దినోత్సవం

మాసాయిపేట, జనవరి 31: మాసాయిపేట మండలం కొప్పులపల్లి గ్రామంలో బుధవారం పౌరహక్కుల దినోత్సవాన్ని మాసాయిపేట తహసీల్దార్ జ్ఞానజ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. సమాజంలో అందరూ సమానమేనని, సమాజంలో జీవించే హక్కు, స్వేచ్ఛ, సమానత్వం, రాజ్యాంగం ప్రతీ పౌరునికి కల్పించిందని పేర్కొన్నారు. కుల, మత బేధాలు లేకుండా ప్రజలందరూ స్వేచ్ఛగా జీవించే హక్కు రాజ్యాంగం కల్పించిందని వెల్లడించారు. సమాజంలో ఎవరినీ కూడా తక్కువ చేసి చూడవద్దని సూచించారు. చట్టానికి అందరూ సమానమేనని మాసాయిపేట తహసీల్దార్ జ్ఞానజ్యోతి ఈ సందర్భంగా వివరించారు. సమాజంలో పౌరులు, ప్రజలు ఎలాంటి దురలవాట్లకు లోనుకాకుండా ఆరోగ్యాలను, కుటుంబాలని కాపాడుకోవాలని సూచించారు. ప్రతీ ఒక్కరు కులమతాలకు అతీతంగా కలిసిమెలిసి జీవించాలని, రాజ్యాంగం కల్పించిన హక్కులను వినియోగించుకుని స్వేచ్ఛగా బతకాలని, శాంతియుత జీవితం గడపాలని ఈ సందర్భంగా తహసీల్దార్ గ్రామస్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ కనకమ్మ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంతోనే ప్రజలకు మేలు

● విగ్రహావిష్కరణలో వక్తలు

చిన్నశంకరంపేట, జనవరి 31: చిన్నశంకరంపేట మండలంలోని కామారం గ్రామంలో బుధవారం అంబేడ్కర్ విగ్రహావిష్కరణ చేశారు. సర్పంచ్ పూలపల్లి యాదగిరి యాదవ్ ఆధ్వర్యంలో రామాయంపేట సీఐ వెంకట్ అంబేడ్కర్, తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంతోనే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగిందన్నారు. ఎమ్మార్పీఎస్ అనుబంద సంఘాల నాయకులు మాట్లాడుతూ అంబేడ్కర్ కృషి వల్లే ప్రతి ఒక్కరికీ స్వేచ్ఛ లభించిందన్నారు. ఆయన చరిత్రను ఎంత చెప్పినా తక్కువే అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాజు, వైస్ ఎంపీపీ సత్యనారాయణ గౌడ్, ఎంపీటీసీ గొండ స్వామి, సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు మాసాయిపేట యాదగిరి మాదిగ, పాతూరు రాజు మాదిగ, స్వామేల్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు యాదిగిరి మాదిగ, మురళీ మాదిగ, సుధాకర్, మండలాధ్యక్షుడు డప్పు స్వామి పాల్గొన్నారు.

●రేగోడు: మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో బుధవారం సర్పంచ్ నిర్మల, ఎంపీపీ సరోజన, జడ్పీటీసీ యాదగిరి లు గాంధీ, అంబేడ్కర్ విగ్రహాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీపీసీసీ మెంబర్ మున్నూరు కిషన్, రేగోడు కాంగ్రెస్ అధ్యక్షుడు దిగంబర్‌రావ్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఫిర్యానాయక్ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు నాగిరెడ్డి, చోటుమియా, సంగమేశ్వర్, సుదర్శన్, సాయిలు, శివకుమార్ ఉన్నారు. పోచారంలో అంబేడ్కర్ విగ్రహాన్ని సర్పంచ్ సునిల్ కుమార్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో బాలయ్య, రాములు, సాగర్ తదితరులు పాల్గొన్నారు.



కామారంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సీఐ వెంకట్

ఘనంగా గద్దర్ జయంతి

తూప్రాన్, జనవరి 31: ప్రజా గాయకుడు, ప్రజా యుద్ధనౌక గద్దర్ 75వ జయంతి వేడుకలు పురిటిగడ్డ తూప్రాన్‌లో బుధవారం నిర్వహించారు. తూప్రాన్ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద గద్దర్ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యుద్ధనౌక గద్దర్ చిత్రపటం ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మార్పీస్, బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వేర్వేరుగా గద్దర్ జయంతిని నిర్వహించారు.

వెల్దుర్తిలో

వెల్దుర్తి: మండల కేంద్రమైన వెల్దుర్తిలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద ప్రజా గాయకుడు గద్దర్ జయంతి వేడుకలను బుధవారం మాల మహానాడు మండల అధ్యక్షుడు కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో రవేందర్, అశోక్, నరేష్ తదితరులు ఉన్నారు.



తూప్రాన్‌లో గద్దర్ చిత్రపటానికి నివాళులర్పించిన ఎమ్మార్పీఎస్ నాయకులు

పశువుల గర్భకోశ చికిత్సకు క్యాంపులు

తూప్రాన్, జనవరి 31: జిల్లాలో పశువులకు కృత్రిమ గర్భధారణ, గర్భకోశ చికిత్స, నట్టల నివారణకు ఉమ్మడి మెదక్ జిల్లాలో 132 క్యాంపులు నిర్వహిస్తున్నట్లు జిల్లా పశువైద్యాధికారి విజయశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం తూప్రాన్ మండలం మల్కాపూర్‌లో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికీ జిల్లాలో 94 క్యాంపులు పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో డీఎల్‌డీఏ ఏడీ రాంజీ, ఏడీ వెంకటయ్య, ఉపసర్పంచు ఆంజనేయులుగౌడ్, మండల పశువైద్యాధికారి లక్ష్మి, జేవీఓ ఫాణి, మంజుల, లింగమూర్తి, లయన్స్‌క్లబ్ రీజియన్ చైర్మన్ రాధాకృష్ణ, డిస్ట్రిక్ట్ చైర్మన్ సుఖేందర్, కార్తిక్, అధ్యక్షులు అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

మాస్టర్ మైండ్ స్కూల్‌ను సీజ్ చేయాలి

● ఏబీవీపీ నాయకుల డిమాండ్, ధర్నా

మెదక్ అర్బన్, జనవరి 31: విద్యార్థిని అనుశ్రీ మృతికి కారణమైన మాస్టర్ మైండ్ స్కూల్‌ను సీజ్ చేయాలని డిమాండ్ చేస్తూ.. బుధవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో పాఠశాల ఎదుట ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ... అనుభవం లేని డ్రైవర్లతో ఫిట్‌నెస్ లేని బస్సులను నడుపుతూ చిన్నారుల ప్రాణాలను బలిగొంటున్న స్కూల్ యాజమాన్యంతో పాటు బస్సు డ్రైవర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మాస్టర్ మైండ్ స్కూల్స్ ఎదుట ఆందోళనలకు దిగుతామని వారు హెచ్చరించారు.

సర్పంచులకు ఘన సన్మానం

కల్హేర్/సిర్గాపూర్/హవేళిఘణపూర్/నిజాంపేట/పెద్దశంకరంపేట, జనవరి 31: కల్హేర్, సిర్గాపూర్ మండలాల్లో పదవి కాలం ముగించుకున్న సర్పంచులను బుధవారం సన్మానించారు. సిర్గాపూర్ సర్పంచ్ స్వప్న శంకరయ్యను కలెక్టర్ వల్లూరు క్రాంతి, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి సన్మానించారు. సిర్గాపూర్ మండలంలోని సర్పంచులను సిర్గాపూర్ సర్పంచ్ స్వప్నశంకరయ్య, ఎంపీటీసీ పీరప్ప సన్మానించారు. కల్హేర్ మండలంలోని నాగ్‌ధర్‌లో సర్పంచ్ రవిల మధుకర్, ఉప సర్పంచ్ ఆడివప్ప, వార్డు సభ్యులను కార్యదర్శి వెంకటేష్ సన్మానించారు. హవేళిఘణపూర్ మండల కేంద్రంలో ఎంపీపీ శేరి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో సర్పంచులను ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి సన్మానించారు. గ్రామ సర్పంచులు ప్రభుత్వ ప్రోత్సాహంతో అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారన్నారు. పరిశుభ్రతలో కూడా పట్టణాలతో పోటీపడి స్వచ్ఛ్ విలేజ్‌గా తీర్చిదిద్దారన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సుజాతశ్రీనివాస్‌రెడ్డి, తసీల్దార్ నారాయణ, సర్పంచులు మహిపాల్‌రెడ్డి శ్రీహరి, సవిత, పద్మ, యామిరెడ్డి, అనురాధ, దేవాగౌడ్ , భాగ్యలక్ష్మి, లింగం, రాజు నాయక్, సుభాష్, సౌందర్య, రేణుక, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. నిజాంపేట మండల పరిధిలోని నందిగామ గ్రామంలో బుధవారం గ్రామ సర్పంచ్ లద్ద ప్రీతి ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ సిద్ధరాములు, ఎంపీటీసీ సురేష్, పంచాయతీ కార్యదర్శి ఆరీఫ్ హుస్సేన్, మాజీ సర్పంచులు ఆకుల బాలయ్య, బ్రహ్మచారి, తదితరులు పాల్గొన్నారు. పెద్దశంకరంపేట గ్రామ పంచాయతీలో బుధవారం సర్పంచ్ అలుగుల సత్యనారాయణ వార్డు సభ్యులను, పంచాయతీ సిబ్బందిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు సంవత్సరాల పదవీకాలంలో పెద్దశంకరంపేట అభివృద్ధికి సహకరించిన వార్డు సభ్యులకు, గ్రామ ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వీణాసుభాష్‌గౌడ్, ఉప సర్పంచ్ దశరత్, ఈవో వెంకట రాములు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



సిర్గాపూర్ సర్పంచ్ స్వప్నను సన్మానిస్తున్న జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎమ్మెల్యే సంజీవరెడ్డి



హవేళిఘణపూర్‌లో సర్పంచులను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి



పెద్దశంకరంపేటలో వార్డు సభ్యులను సన్మానిస్తున్న సర్పంచ్ అలుగుల సత్యనారాయణ